
APTEL/25/A2326

# ప్రజలకి చేరువ

సామాన్యుడి ఆయుధం




ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సోమవారం 23-03-2026 సంపుటి : 1 సంచిక : 190 ఎడిటర్ : కుమార్ పేజీలు : 4 వెల రు : 4/-

Ongole | Srikakulam | Vizianagarm | Visakhapatnam | Rajahmundry | Kakinada | Elugu | Vijayawada | Guntur | Kurnool | Kadapa | Chittore | Warangal | Srikakulam | Hyderabad | Mehabubanagar

## ఇరాన్‌పై యుద్ధానికి భారత్‌ను సాయం

# కోరినట్లు కథనాలు..



## స్పందించిన కేంద్రం

పశ్చిమాసియాలో యుద్ధ తీవ్రత రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌ను ఎదుర్కొనేందుకు అమెరికా.. భారత్ నుంచి సైనిక సాయం కోరినట్లు ఇటీవల సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ స్పందిస్తూ.. ఇవి పూర్తిగా నిరాధారమైన వార్తలంటూ కొట్టిపారేసింది.పశ్చిమ భారత్ నుంచి ఇరాన్‌పై దాడులు చేసేందుకు వీలుగా మిలిటరీ స్థావరాలను వినియోగించుకుంటామని అమెరికాఅడిగినట్లు ఆ వార్తల సారాంశం. ఇందుకు సంబంధించి కొన్ని ఆంగ్ల మీడియాల్లోనూ కథనాలు రావడంతో విదేశాంగ శాఖ తమ ఫ్యాక్ట్‌చెక్‌లో స్పందించింది. "ఇలాంటి అసత్య వార్తలను నమ్మవద్దు. నిరాధారమైన, కల్పిత విషయాలపై జాగ్రత్తగా ఉండాలని ప్రజలను కోరుతున్నాం" అంటూ పోస్ట్ చేసింది.

పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ గతంలోనూ భారత్‌పై పలుమార్లు అసత్య ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఇటీవల ఇరాన్ యుద్ధ నౌక ఐరిస్ దేనా-75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసింది. ఆ సమయంలోనూ భారత పోర్టులను అమెరికా ఉపయోగించుకుంటోందన్న వార్తలు వచ్చాయి. వాటిని విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. అవన్నీ తప్పుడు వార్తలే అంటూ తేల్చిచెప్పింది.


2లో..

# యుద్ధం విరమించే

## ఆలోచనలో ఉన్నాం

- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత

యుద్ధంపై ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత మొదలయ్యింది. ఆయిల్ , గ్యాస్ నిల్వలు తగ్గడం, రవాణా ఆగిపోవడంతో ప్రపంచ దేశాల ఆర్థిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ క్రమంలో యుద్ధం ఆగాలని అంతా కోరుకుంటున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై



ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# రంజాన్ వేడుకలు..

## భక్తిశ్రద్ధలతో ముస్లింల ప్రార్థనలు

తెలుగు రాష్ట్రాల్లోని ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. ఈద్గాల వద్దకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఆప్యాయంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.





## సాగులో సాంకేతికత

# జోడిస్తే లాభాలు

అన్నదాతలు సంఘటితమై.. సేద్యంలో సాంకేతికత జోడిస్తే లాభాలు సాధించవచ్చని.. ప్రాంతాల వారీగా డిమాండ్ ఉన్న పంటలను ప్రకృతి సాగు విధానంలో పండిస్తూ.. సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటే దళారుల దోపిడీకి అడ్డుకట్ట వేయవచ్చని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రైతులకు సూచించారు. గుంటూరుజిల్లా ప్రత్తిపాడు మండలం కొర్నెపాడులోని 'రైతు నేస్తం' ఫౌండేషన్ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం తెలుగు రాష్ట్రాల్లో మిద్దెతోటల పెంపకంలో రాణిస్తున్న 30 మందికి 'రైతు నేస్తం ఫౌండేషన్, రఘోత్తమరెడ్డి మిద్దె తోటల పురస్కారాలు-2025' అవార్డులు ప్రదానం చేశారు.

## ఆధ్యాత్మిక కేంద్రాలుగా

## టిటిడి ఆలయాలు


- తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకుండా కఠిన చర్యలు
- కాలుష్య రహితంగా తిరుమల క్షేత్రం అభివృద్ధి
- అధికారులకు సిఎం చంద్రబాబు సూచనలు



2లో..

# హైదరాబాద్‌ను మించేలా అమరావతి నిర్మాణం

హైదరాబాద్‌ను మించేలా అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. వైకాపా పాలనలో అమరావతిని పూర్తిగా పక్కన పడేశారని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యంత అధునాతన టెక్నాలజీతో అమరావతిని స్మార్ట్ సిటీగా మారుస్తామన్నారు. కృత్రిమ మేధ వినియోగం, విస్తరణ లక్ష్యంగా గచ్చిబౌలిలోని ఐఎస్‌బీలో ఏర్పాటు చేసిన సౌత్ ఏసియా లెర్నింగ్ సమ్మిట్‌లో చంద్రబాబు పాల్గొన్నారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1990 దాటాక మనవద్ద ఇంటర్నెట్ ప్రారంభమైందనీ, 1995 నుంచి నాలెడ్జ్ ఎకానమీ మొదలైందని చెప్పారు."ఉమ్మడి ఏపీలో ఐటీ కంపెనీలు తెచ్చేందుకు అనేకమందితో మాట్లాడా. దిల్లీ వెళ్లి బిల్ గేట్స్‌ను కలిశా. భారత్‌లో ఐటీ కంపెనీలు పెట్టాలని కోరా. లెక్కలు, ఇంగ్లీష్‌లో భారతీయులు గొప్పవాళ్లని ఆయనకు చెప్పా. హైదరాబాద్‌లో ఐటీ కార్యాలయం పెట్టాలని బిల్‌గేట్స్‌ను కోరా. అప్పట్లో హైదరాబాద్ వచ్చేందుకు వాళ్లు తొలుత నిరాకరించారు. అక్కడికి వస్తే మాకు ఎలాంటి ప్రయోజనాలు కల్పిస్తారని అడిగారు. అప్పట్లో ఐఎస్‌బీ తెచ్చేందుకు ఎంతో కృషి చేశా. శంషాబాద్ విమానాశ్రయం కోసం 5 వేల ఎకరాలు సేకరించాం. హైదరాబాద్‌కు అనేక విద్యాసంస్థలు, నల్సార్, ట్రిపుల్ ఐటీ తీసుకువచ్చాం. అప్పట్లో కేవలం మంజీరా నుంచే తాగునీరు వచ్చేది. కానీ, కేవలం 9 నెలల్లోనే కృష్ణానది నుంచి తాగునీరు తీసుకొచ్చాం. 1999-2004 మధ్య హైదరాబాద్‌ను శరవేగంగా అభివృద్ధి చేశాం. అప్పట్లో నేను కృషి చేయడం వల్లే జీనోమ్ వ్యాలీ వచ్చింది. అనేక కారణాల వల్ల 2004లో ఓడిపోయాం. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పదేళ్లు పట్టింది. 2014 నుంచి 2019 వరకు ఏపీలో అనేక కార్యక్రమాలు చేపట్టాం. కేవలం అభివృద్ధిపైనే దృష్టి పెడితే ఎన్నికల్లో గెలవలేం. 2019 నుంచి 2024 మధ్య ఏపీలో అభివృద్ధి కుంటుపడింది. 2024లో మళ్లీ వచ్చాక అభివృద్ధి, సంక్షేమం అందిస్తున్నాం. ఇప్పుడు అనేక రంగాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. 30 ఏళ్ల క్రితమే ఐటీ గురించి ఆలోచించా. ఏఐ, డేటా సెంటర్లు, క్వాంటమ్, స్పేస్ టెక్నాలజీ వచ్చాయి. డ్రోన్లు, ఎయిర్ అంబులెన్స్‌లు త్వరగా విస్తరిస్తున్నాయి.

## పశు పోషకులకు

# ఊరట

- రుసుములపై సడలింపులు జారీ
- మంత్రి అచ్చన్నాయుడు వెల్లడి




2లో..

## ప్రతి 45 రోజులకు ఒక

# ఎయిర్‌పోర్ట్ :




# ఫుడ్ సేఫ్టీలో అత్యాధునిక పరిశోధన శాల

### అక్రిడిటేషన్ వచ్చాక పూర్తిస్థాయి పరీక్షలు

### వెల్లడించిన ఏపీ మంత్రి సత్యకుమార్

కొద్దికాలం వ్యవధిలోనే తిరుమలలో ఫుడ్ సేఫ్టీ పరిశోధన శాలను ప్రారంభించామని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ పరిశోధనశాలలో అనేక పరీక్షలు చేసే యంత్రాలు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. పాలు, నెయ్యి, నూనెతో పాటు ముడి సరుకుల నాణ్యతను పరీక్షించవచ్చని చెప్పుకొచ్చారు.





# ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్..

# ఉత్తరాంధ్రకు మరో మణిహారం

ఉత్తరాంధ్రలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. రూ.1.05 లక్షల కోట్లతో ఏర్పాటు కాబోతున్న ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయబోతున్నట్లు చెప్పారు. ఆర్సెల్లార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకు మరో మణిహారంగా నిలుస్తుందన్నారు. వైకాపా పాలనలో ఉత్తరాంధ్రను నిర్లక్ష్యం చేశారని, సీఎం చంద్రబాబు 20 నెలల్లో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపించారని

# సంపాదకీయం

## ఓటుహక్కు లేనివారుగా పౌరులు!

భారత గణతంత్ర రాజ్యం ఆవిర్భవించిన తరువాత ఇంచుమించు మొదటి నాలుగు దశాబ్దాల పాటు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) అనే రాజ్యాంగ సంస్థ ఉనికి గురించి చాలామంది భారతీయులకు తెలియనే తెలియదు. భారత రాజ్యాంగంలోని 15వ విభాగం (ఎన్నికలు) లోని నిబంధనల గురించి తెలిసిన వారూ బహు తక్కువ మందేనని అనడం సత్యదూరమేమీ కాదు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరుగుతున్నాయి. ఎనలేని ఆనందోత్సాహాలతో ప్రజలు ఓటు వేస్తున్నారు. అయితే ఎన్నికల నియమ నిబంధనలు, పోలింగ్ ఏర్పాట్లు, సన్నాహాలకు సంబంధించిన విషయాలు, మరీ ముఖ్యంగా ఎన్నికల ఫలితాల ప్రకటనకు దారి తీసే ప్రక్రియ గురించి అవగాహన ఉన్నవారు చాలా తక్కువ మందే అనడంలో అత్యుక్తి లేదు.

ఓటర్ జాబితాలలో తమ పేరు ఉన్నవారందరూ ఓటు వేయగలుగుతారు. ఈ ప్రకారం కోట్లాది మంది ఓటు వేయడం జరుగుతోంది. అయితే అనేక లక్షల మంది ఓటు వేయలేక పోవడమూ జరుగుతోంది. ఒక నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిచినప్పటికీ ఆ నియోజకవర్గంలోని ఓటర్లు అందరూ ఆ అభ్యర్థిని తమ ప్రతినిధిగా అంగీకరించి తమ జీవన వ్యాపకాలలో నిమగ్నమవుతారు.

చెదురుమదురు హింసాత్మక సంఘటనలు, దొంగ ఓట్లు వేస్తున్నవారిని పట్టుకోవడం మినహా ఎన్నికలు చాలవరకు పెద్దగా ప్రాధాన్యం లేని సంఘటనలుగా మిగిలిపోతున్నాయి. ఈ ప్రశాంత పరిస్థితుల వెనుక చాలా అన్యాయాలు జరిగిపోతున్నాయి. చాలా మంది ప్రజల పేర్లను ఓటర్ జాబితాలలో చేర్చడం జరగడం లేదు. ఓటర్ జాబితాలలో ఉన్న చాలా మంది తమ ఓటుహక్కు వినియోగించుకోలేని పరిస్థితులు నెలకొనడం ప్రతి ఎన్నికల సందర్భంలోనూ పునరావృతమవుతూనే ఉంది. ఓటుహక్కు వినియోగించుకోలేక పోతున్న వారిలో దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల వారు, మతపరమైన మైనారిటీలు అత్యధికంగా ఉంటున్నారు. ఓటుహక్కును వినియోగించుకోలేని పరిస్థితులపై పోలింగ్ రోజున, ఆ తరువాత కొన్ని దినాల వరకు ఆందోళనలు జరుగుతాయి. ఆ తరువాత అవి వాటికవే చల్లారిపోతాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) భారత ఎన్నికల సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తారు. సీఈసీ సాధారణంగా ప్రముఖ సివిల్ సర్వెంట్ అయి ఉండడం కద్దు. అయితే ఆయన ప్రజల దృష్టికి పెద్దగా వచ్చే వ్యక్తికాదు. మౌనంగా తన విధులు నిర్వహించే అధికారి. సీఈసీ అరుదుగా మాత్రమే వివాదాల్లో చిక్కుకుంటారు. కోర్టుల చుట్టూ తిరగవలసిన తిప్పలూ ఆయనకు ఉండవు. రాజకీయ పక్షాలు చీలిపోయినప్పుడు, వివిధ పార్టీలకు ఎన్నికల చిహ్నాలు కేటాయించడంపై వివాదం రగుల్కొన్నప్పుడు మాత్రమే సీఈసీ వార్తల్లోకి రావడం పరిపాటి.

1990లో సీఈసీగా టిఎన్ శేషన్ నియమితులయ్యారు. రాజ్యాంగంలోని 15వ విభాగానికి ఆయన ఊపిరి పోశారు. రాజకీయ పక్షాలు, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు చట్టాలను పాటించేలా ఆయన కట్టడి చేశారు. ఈసీఐకి అపరిమిత అధికారాలు ఉన్నాయన్న సత్యాన్ని ప్రజలకు ఆయన ఎరుక పరిచారు. ఎన్నికల వ్యవహారాలకు సంబంధించి సుప్రీం కోర్టులో ఈసీఐ తరఫున ఆయన పలు కేసులు దాఖలు చేశారు. సర్వోన్నత న్యాయస్థాన తీర్పులను అందరూ పాటించేలా నిష్కర్షగా వ్యవహరించారు. శేషన్ తన విధుల నిర్వహణలో నిష్ఠాబద్ధంగా తటస్థత పాటించేవారు. ఎవరి పట్ల అనుచిత ఆదరం చూపేవారు కాదు, ఎవరినీ నిష్కారణంగా అయిష్టపడేవారు కాదు. చండశాసనుడిగా వ్యవహరించి ప్రజల మదిలో అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ నిలిచిపోయారు. ఆయన తరువాత సీఈసీలు అయిన జేఎమ్ లింగ్డో, టిఎస్ కృష్ణమూర్తి, నవీన్ చావ్లా, ఎస్‌వై ఖురేషి తమ విధులను నిష్పాక్షికంగా నిర్వహించి ప్రజల ప్రశంసలకు పాత్రులయ్యారు. అయితే గత దశకంలో సీఈసీ ప్రతిష్ఠ మసకబారడం ప్రారంభమయింది. సీఈసీలు వివాదాల్లో చిక్కుకోవడం ఆరంభమయింది. 2025--26లో ప్రారంభించిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) సీఈసీ తటస్థతను అప్రతిష్ఠ పాలు చేసింది. రాజ్యాంగంలోని అధికరణ 326 ఇలా పేర్కొంది: 'లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభలకు ఓటుహక్కు విధానంపై ఆధారపడి ఎన్నికలు జరుగుతాయి. అనగా భారతీయులై ఉండి, నిర్దేశిత తేదీకి 18 సంవత్సరాలు నిండిన వారందరికీ ఓటుహక్కు ఉంటుంది. ఏ నిర్దిష్ట తేదీకి 18 సంవత్సరాలు నిండవలెనో లోక్‌సభ లేక శాసనసభ నిర్ణయిస్తుంది (సందర్భానుసారంగా). అయితే నిర్దిష్ట ప్రదేశంలో నివాసం ఉండక పోవటం, మానసిక అస్వస్థత, నేరాలు చేయుట, అవినీతి చట్ట వ్యతిరేక చర్యలు మొదలగు కారణాలపై ఈ రాజ్యాంగం కింద గానీ, లేక మరేదైనా శాసనం కింద గానీ ఓటర్లుగా అనర్హులైన వారికి ఓటర్లుగా నమోదయ్యే అర్హత ఉండదు.' వయోజన ఓటుహక్కు, పౌరుడు, ఓటరుగా నమోదయ్యే హక్కు అనే అంశాల గురించి ఈ నిబంధన నొక్కి చెప్పింది. మరింత సరళంగా చెప్పాలంటే వయోజనులు అందరినీ (ఈ దేశ పౌరులు కాకపోతే మినహా) ఓటర్ జాబితాలలో చేర్చాలని నిర్దేశించింది. సాధారణంగా తాజాగా సవరించిన ఓటర్ జాబితాలలో మొత్తం ఓటర్ల సంఖ్య సంబంధిత రాష్ట్ర వయోజన జనాభాకు ఇంచుమించు సరిసమానంగా ఉంటుంది. ప్రతి పది సంవత్సరాలకు జనాభా గణన నిర్వహిస్తే వయోజనుల సంఖ్య కచ్చితంగా తెలుస్తుంది. మన దేశంలో చివరి జనాభా గణన 2011లో జరిగింది. అయితే అత్యాధునిక గణాంక పద్ధతులను ఉపయోగించి జనాభా పెరుగుదలను అంచనా వేయవచ్చు. నిపుణులు ఆ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. ఈ దృష్ట్యా తాజాగా సవరించిన ఓటర్ జాబితాలలో మొత్తం ఓటర్ల సంఖ్య ఒక రాష్ట్రంలోని వయోజన జనాభాకు సంబంధించిన అంచనాకు దాదాపుగా సమస్థాయిలో ఉండితీరాలి. అయితే 'సర్' అనంతర ఓటర్ జాబితాలు ఆశ్చర్యం గొలుపుతున్నాయి. అంతకు మించి అసంతృప్తికి కారణమవుతున్నాయి. 'సర్' అనంతర ఓటర్ జాబితాల్లోని ఓటర్ల సంఖ్య, సంబంధిత రాష్ట్రాలలోని వయోజన జనాభా అంచనాలకు మధ్య దిగ్భ్రాంతికరమైన వ్యత్యాసమున్నట్లు యోగేంద్రయాదవ్ నిరూపించారు. దీన్ని బట్టి 'సర్' సమ్మిళితంగా జరగలేదని, లక్షలాది వయోజన పౌరులను ఓటర్ జాబితాలలో చేర్చలేదని స్పష్టమయింది. 'సర్' ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాలకు సంబంధించిన ఈ కింది గణాంకాలను చూడండి: ప్రతి రాష్ట్రం పేరు ఎదుట ఉన్న మొదటి సంఖ్య 'సర్'కు పూర్వం ఓటర్ల--వయోజన జనాభా మధ్య నిష్పత్తి కాగా రెండో సంఖ్య తుది ఓటర్ల సంఖ్య వయోజన జనాభా మధ్య నిష్పత్తి-- (అంకెలు అన్నీ శాతాల్లో) బిహార్: 96.7 శాతం; 90.7 శాతం; ఛత్తీస్‌గఢ్: 99.5, 87.3; గుజరాత్: 96.0, 97.2; కేరళ: 100.7; 97.2;

## శ్రమ ఎవరిది శిలాఫలకాలు ఎవరివి

మొదటి పేజీ తరువాయి

" బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే జిల్లా జైలుకు భూసేకరణ చేశాం. జైలు నిర్మాణం పూర్తయి రెండేళ్లయింది. ఇప్పుడు వచ్చి మీరు ప్రారంభిస్తున్నారు. శ్రమ ఎవరిది.. శిలాఫలకం ఎవరిది? ఇప్పటికీ రుణమాఫీ పూర్తి కాలేదు. నర్మెట్టలోనే 350 మంది రైతులకు రుణమాఫీ అవ్వలేదు. మూడు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టారు. రైతుబంధు బకాయిలు వెంటనే ఇవ్వాలని రైతుల తరఫున అడుగుతున్నా. పంటల బీమా ఇప్పటికీ చేయించలేదు. వర్షాలు, తుపానుల వల్ల నష్టపోయిన పంటలకు బీమా రాలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సిద్దిపేటకు ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా ఇవ్వలేదు" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## ఫుడ్ సేఫ్టీలో అత్యాధునిక పరిశోధన శాల

మొదటి పేజీ తరువాయి

తిరుమలలో ప్రతిష్టాత్మకంగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ల్యాబ్‌ని సీఎం చంద్రబాబు ప్రారంభించారని వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన దురదృష్టకరమైన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని 2024లో ఎఫ్ఎస్ఎస్ఏఐతో ఏపీ ప్రభుత్వం ఎంవోయూ కుదుర్చుకుందని తెలిపారు. విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కి అదనంగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రస్తావించారు.

శనివారం తిరుమలలో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.25 కోట్లతో నిర్మించిన ఈ పరిశోధన శాలలో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని వెల్లడించారు. ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో ఈ పరిశోధన శాల పని చేస్తోందని వివరించారు. అప్పటి వరకు అనాలిసిస్ జరుగుతునే ఉంటుందని తెలిపారు. మూడు నెలల్లో గుంటూరు, వైజాగ్‌లో పరిశోధన శాలలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఏపీలో వివిధ ప్రాంతాల్లో 11 స్టేట్ ఫుడ్ ల్యాబ్‌లను ఆధునికీకరించామని అన్నారు. నాణ్యతలో ఎక్కడ రాజీపడ బోమని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

## ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ అయినా అమలైందా?: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 4 కోట్ల మందికి టోపీ పెట్టిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం రోజున 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అభయహస్తం దస్త్రంపై సీఎం తొలి సంతకం చేశారన్నారు. గవర్నర్ ప్రసంగంలోనూ ఆరు గ్యారంటీలపై సంతకం జరిగిందని చెప్పించారన్నారు.

" ఆరు గ్యారంటీల్లో అర గ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదు. సీఎం సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టనున్నాం. వచ్చే శుక్రవారం నాడు శాసనసభలో మేం ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించాం. అందుకు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నాం. కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశమే కాబట్టి ఆ పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇవ్వాలి. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామన్నారు.. వెంటనే అమలు చేయాలి. పింఛను రూ.2వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామన్నారు.. వెంటనే పెంచాలి. విద్యార్థులకు విద్యాభరోసా కార్డులు ఇస్తామన్నారు.. వెంటనే ఇవ్వాలి. కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామన్నారు.. అదీ అమలు చేయాలి. మేం పెట్టే బిల్లు పాస్ అయితే, హామీలన్నీ చట్టప్రకారంగా అమలవుతాయి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## పశు పోషకులకు ఊరట

మొదటి పేజీ తరువాయి

పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది. పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపునిచ్చింది. భవన అనుమతుల రుసుములో సడలింపులు చేసింది. ఈ సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం మాట్లాడారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్నరైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు/మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ ఛార్జీలు మినహాయింపునిచ్చినట్లు మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని మంత్రి చెప్పుకొచ్చారు. ఈ నిర్ణయంతో మరింత మందికి స్వయం ఉపాధి, సమృద్ధి లభిస్తుందని వెల్లడించారు. గత జూన్‌లో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక కేంద్రాలుగా టిటిడి ఆలయాలు

మొదటి పేజీ తరువాయి

తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టిటిడి బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన ట్రస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

## యుద్ధం విరమించే ఆలోచనలో ఉన్నాం

మొదటి పేజీ తరువాయి

అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు. ఇకపోతే యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించ డానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టంచేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వశాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యూఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

## ప్రతి 45 రోజులకు ఒక ఎయిర్‌పోర్ట్ :

మొదటి పేజీ తరువాయి

విశాఖ వన్‌టౌన్ : ప్రపంచంలోనే సురక్షితమైన దేశంగా భారత్ నిలిచిందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. భారత్ సుస్థిరమైన వృద్ధిని ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని పేర్కొన్నారు. విశాఖలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. "ప్రతి 45 రోజులకు ఒక విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్నాం. ఉడాన్ స్కీమ్ ద్వారా సామాన్యుడికి విమాన ప్రయాణం అందుబాటులోకి వచ్చింది. ఎన్డీయే హయాంలో ఎయిర్‌పోర్టుల సంఖ్య 167 కు చేరింది. స్వదేశీ తయారీ విమానాలు అందుబాటులోకి వస్తే డొమెస్టిక్ సర్వీసులు మరింత విస్తృతమవుతాయి" అని పేర్కొన్నారు.

## ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం రేవంత్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

అదే రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయడైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు.

సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ్' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సమీకృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2-3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశుగ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిడుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.

# బేస్తవారిపేటలో దారుణ హత్య.

బేస్తవారిపేట:ప్రజలకు చేరువ



బేస్తవారిపేట మండలం బేస్తవారిపేట గాంధి బజార్ లో దారుణ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సత్తాబి పెద్ద కుమారుడు రాజా హుస్సేన్, చిన్న కుమారుడు ఖాజావలి, కుటుంబానికి చెందిన రాజా హుస్సేన్ కుమార్తెను పొదలకుంట పల్లె గ్రామానికి చెందిన వలి అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు, రాజా హుస్సేన్ అల్లుడు వలి గత కొన్ని రోజులుగా తన భార్యను వేధిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై రాజా హుస్సేన్ పలుమార్లు అతనిని హెచ్చరించినప్పటికీ, వలి వారిపై కక్ష పెంచుకొని ఈ రోజు మధ్యాహ్నా సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రలో ఉండగా, వెనుక గది ద్వారం నుండి ఇంట్లోకి ప్రవేశించిన వలి కత్తితో దాడి చేసిహత్య చేశాడు. అనంతరం అక్కడి నుండి పారిపోతుండగా రాజా హుస్సేన్ కనిపించడంతో అతని పైనా కూడా కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

# పొన్నలూరులో పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**– ఆరుగురు అరెస్ట్**



పొన్నలూరు : ప్రజలకి చేరువ
మండల పరిధిలోని పొన్నలూరు గ్రామ సమీపంలో గల డొంక ఏరియాలో అక్రమంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. పొగాకు తోటల మధ్య గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో ఎస్ఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు.ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ. 5,280 నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో, పంట పొలాల్లో ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు. నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# 22ఏ నిషేధిత జాబితా నుంచి ఏపీఐఐసీ భూముల తొలగింపు

పరిశ్రమల అభివృద్ధికి ఊతమిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ద్వారా భూముల కేటాయింపుల్లో అడ్డంకిగా మారిన కీలక అంశాన్ని తొలగించింది. 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఏపీఐఐసీ భూములను ఆ జాబితా నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రజలకు పరిహారం చెల్లించిన అనంతరం ఏపీఐఐసీ చేతిలోని ప్రభుత్వ భూములు, డీకేటీ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి అభ్యంతరాలు లేని 70 వేల ఎకరాలను 22–ూ నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి అనుమతించింది. రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ఏపీఐఐసీ అధీనంలో ఉన్న మొత్తం 51,603.46 ఎకరాల భూముల మ్యుటేషన్‌కు అనుమతించింది. రెవెన్యూ రికార్డులు లేదా వెబ్‌ల్యాండ్‌లో ఏపీఐఐసీ పేరు మీద భూములను మార్చేలా తదుపరి చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. సబ్ రిజిస్ట్రార్ల ద్వారా నిషేధిత జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్. యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# క్రీడలతో ఐకమత్యం పెంపు.





**– 23వ ఆర్.సి.సి క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన.. కదిరి పార్ధసారధి**

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ
క్రీడలు ఐక్యతను పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ ఒకరస్పాండెంట్ కదిరి పార్థసారథి అన్నారు శీలంవారిపల్లె గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న 23వ ఆర్ సి సి క్రికెట్ టోర్నమెంట్ ని శనివారం కదిరి పార్థసారథి ప్రారంభించారు.మొదటి బహుమతి కదిరి వెంకట ప్రకాశ్ రావు బ్రదర్స్ 75,000/-రూపాయలు, ద్వితీయ బహుమతి మాజీ ఎంపీటీసీ మునగల నారాయణ రెడ్డి,మునగల ప్రవీణ్ కుమార్ రెడ్డి,45,116/-రూపాయలు,ముడవ బహుమతి కదిరి రత్నం కుమారుడు శివ,25,116/-రూపాయలు, నాలుగోవ బహుమతి రావూరి నారయ్య కుమారులు 15,116/-రూపాయలు బహుమతులు సమకూరుస్తున్నారు .ఈ కార్యక్రమం లో సర్పంచ్ షేక్ బుజ్జి, మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి,తికణం బాబురావు,కొట్టే శ్రీను,కదిరి రత్నం,ముడియాల గోపి, షేక్ నాయబ్ రసూల్, షేక్ సత్తార్,టి లక్ష్మి నారాయణ, మూరం మస్తాన్ రెడ్డి, అంజనాద్రి,కొట్టే సుభాష్,ఇరగని మాధవ రావు, సంగిశెట్టి పిరయ్య,కొట్టే



అంకయ్య,సైదులు,పాశం సురేష్,దామోదర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న కార్యకర్తకు బాసట

**– 20 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసిన దద్దాల**

చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ
పార్టీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా కనిగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. హనుమంతునిపాడు మండలం, ఉమ్మనపల్లి పంచాయతీకి చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త రుద్రపాటి మార్టిన్ - మార్తమ్మ దంపతుల కుమారుడు జాన్సన్ గత కొంతకాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో



బాధపడుతున్నారు.ప్రస్తుతం జాన్సన్ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు.జాన్సన్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 20,000/- లు నగదును ఆయన తల్లి మార్తమ్మకు కనిగిరిలోని పార్టీ కార్యాలయంలో అందజేశారు.బాధితుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి, అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమంతునిపాడు మండల పార్టీ అధ్యక్షుడు యక్కంటి శ్రీనివాసులరెడ్డి, నాయకులు తెల్లగడ్డ వెంకట్రావు, కొదమల జకరయ్య మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.కష్టాల్లో ఉన్న కార్యకర్తలను ఆదుకోవడం మన బాధ్యత. జాన్సన్ త్వరగా కోలుకోవాలని దద్దాల నారాయణయాదవ్ ఆకాంక్షించారు

# మార్కాపురం జిల్లా సీఐటీయు తొలి సారథిగా ఆవులయ్య ఏకగ్రీవంగా ఎన్నిక.

గిద్దలూరు : ప్రజలకు చేరువ
కార్మిక లోకానికి అండగా ఉంటూ, వారి హక్కుల పోరాటంలో నిరంతరం శ్రమించే సీఐటీయు మార్కాపురం జిల్లా కమిటీ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ ఎన్నికల్లో మార్కాపురం జిల్లా తొలి సీఐటీయు అధక్షునిగా గిద్దలూరుకి చెందిన తొలుచూరి ఆవులయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జరిగిన మార్కాపురం జిల్లా ప్లీనంలో సీఐటీయు నాయకులందరూ ఏకగ్రీవంగా ఆవులయ్య పేరును ప్రతిపాదించగా, ప్లీనంలోని వారందరూ పూర్తి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై, పనిచేసే కూలీల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తానని ప్రకటించారు. జిల్లా పరిధిలోని కార్మికులందరినీ ఏకం చేసి, సీఐటీయును బలోపేతం చేయడమే తన ప్రథమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. జిల్లా ఆవిర్భావం తర్వాత మొదటి అధ్యక్షునిగా ఎన్నికైన ఆవులయ్యకు పలువురు కార్మిక నేతలు, ప్రజా సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన కార్మిక నాయకులు, సీఐటీయు రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.



# పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు ఏడుగురుని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక పోలీసు బృందాలు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో టాస్క్ ఫోర్స్ సీఐ యు. సుధాకర్ ఆధ్వర్యంలో ఎస్సై సుదర్శన్, ఏఎస్ఐ మహబూబ్బాషా మరియు సిబ్బంది కలసి కొండేపి పోలీస్ స్టేషన్ పరిధిలోని అనకర్లపూడి గ్రామ పొలాలలో పేకాట స్థావరంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఏడుగురికి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి 7 మోటార్ సైకిళ్లు, 7 సెల్ ఫోన్లు మరియు రూ.46,900/- నగదు స్వాధీనం చేసుకున్నారు. జూద క్రీడలు మరియు ఇతర అసాంఘిక



కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే, జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి కార్యక్రమాలకు సంబంధించి సమాచారం ఉంటే, వెంటనే డయల్ 112 నంబర్‌కు లేదా పోలీసు వాట్సాప్ నంబర్ 9121102266కు మెసేజ్ ద్వారా తెలియజేయాలని ప్రజలను కోరారు.

# రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆకుపాటి



చంద్రశేఖరపురం, ప్రజలకు చేరువ
పామూరు పట్టణంలోని అంకాలమ్మ వీధి, బాలసుబ్బయ్య నగర్ వీధి ఎదురుగా ఆదివారం ఆర్కే గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ నూతన ప్రారంభోత్సవ కార్యక్రమంనకు రెస్టారెంట్ యజమాని ముప్పాళ్ళ కిరణ్ ఆహ్వానం మేరకు ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారుఈ సందర్భంగా రెస్టారెంట్ యజమాని ముప్పాళ్ళ కిరణ్ ను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, పామూరు పట్టణంలో నాణ్యమైన ఆహారం అందించే ఇలాంటి ఫ్యామిలీ రెస్టారెంట్లు ఏర్పడటం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. శుభ్రత, రుచికరమైన వంటకాలు ఉంటే ప్రజల ఆదరణ తప్పకుండా లభిస్తుందని అన్నారు.అలాగే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఇలాంటి వ్యాపారాలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో

# వేసవిలో తాగునీటి కొరత లేకుండా చూడాలి

**- రానున్న వేసవిలో జిల్లాలోగా ఎక్కడా త్రాగునీటి కొరత లేకుండా అధికారులు**
**- కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలి**
**- జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ**
**- 2026-27 ఆర్ధిక సంవత్సరానికి రూ.14. 07 కోట్లతో జిల్లాపరిషత్ బడ్జెట్ ఆమోదం**
**- జెడ్పి చైర్ పర్సన్ అధ్యక్షతన జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం**




ప్రజలకు చేరువ
ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రానున్న వేసవిలో త్రాగునీటికి ఎటువంటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా ప్రజాపరిషత్ సమావేశపుహాలులో ఆదివారం జరిగిన జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశానికి జెడ్పి చైర్ పర్సన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు 557 ఉండగా, వాటిలో 194 ట్యాంకులలో 75 నుండి 95 శాతం వరకు, 280 చెరువులలో 70 నుండి 50 శాతం వరకు నీటిని నింపడం జరిగిందన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రానున్న వేసవిలో త్రాగునీటిఎద్దటి రాకుండా సంబంధిత శాఖల అధికారులందరూ కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలనీ, ప్రజల త్రాగునీటి అవసరాలకు తగినవిధంగా మంచినీటి చెరువులన్నింటిని పూర్తిస్థాయిలో నింపుకోవాలన్నారు. జల్ జీవన్ మిషన్ కింద చేపట్టవలసిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేసే లోగా మంచినీటి చెరువులను నింపుకునేలా పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీటిపారుదల అడ్డంకిగా ఉన్న తూడు గుర్రపుడెక్కను తొలగించి, శివారు ప్రాంతాలకు సైతం నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిలాల్లో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలని, ఖాళీగా డాక్టర్లు, సిబ్బంది పోస్టులు భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని, జిల్లాలో ప్రజలకు అసౌకర్యం ఉన్న రోడ్లకు వెంటనే మరమ్మత్తులు చేయాలన్నారు. జిల్లాలో నిర్మాణం పూర్తి ఐన రైతు సేవా కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్ర భవనాలు వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో గృహ వినియోగదారులకు వంట సరఫరాకు ఎటువంటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధుల ప్రోటోకాల్ ను తప్పనిసరిగా పఠింహాలని అధికారులను ఆదేశించారు. శాసనమండలి సభ్యులు వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలోని పోలవరం మండలం ప్రగడపల్లిలో రైతు సేవా కేంద్రం, సామజిక ఆరోగ్య కేంద్ర భవనాలు నిర్మాణం పూర్తి అయినప్పటికీ విద్యుత్ సౌకర్యం కల్పించని కారణంగా ప్రారంభానికి నోచుకోలేదన్నారు. అదేవిధంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో రైతు సేవా కేంద్రం, సామజిక ఆరోగ్య కేంద్ర భవనాలు నిర్మాణం పూర్తి అయినప్పటికీ విద్యుత్ సౌకర్యం కల్పించని కారణంగా వినియోగంలోకి రాలేదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో గైనకాలజిస్టులు, పెడీట్రిషియన్ వైద్యుల పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, సదరు పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల ఏలూరు జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో అధిక శాతం అబార్షన్లు జరిగాయని వార్తలు వచ్చాయని, వీటిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ మాట్లాడుతూ జిల్లాలో గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరాలో ఎటువంటి కొరతా లేదన్నారు. జిల్లాలో పైపు లైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా కొన్నిసీట్లు 5 వేల వరకు ఉన్నాయని, వాటిని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ వసతి గృహాలకు కూడా ఎటువంటి కొరతా లేకుండా వంట గ్యాస్ ను సరఫరా చేస్తున్నామన్నారు. వాణిజ్య అవసరాలకు కూడా 10 నుండి 20 శాతం మేర అదనంగా గ్యాస్ సరఫరా చేస్తున్నట్లు జేసీ తెలియజేసారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ జుత్తిక నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో స్థానిక సంస్థల నుండి గ్రంధాలయ సెస్సు గా 9 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని, వాటిని గ్రందాయాలయ సంస్థకు జమచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆచంట జెడ్పిటిసి మాట్లాడుతూ అతి తీవ్రమైన వ్యాధి ఎస్ఎంఏ ని ముందుగానే గుర్తించేందుకు బిడ్డ పుట్టిన రెండునెలలలోగా వైద్య పరీక్షలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం నుండి అనుమతులు మంజూరు కోరాలని విజ్ఞప్తి చేశారు. 2026-27 ఆర్ధిక సంవత్సరానికి రూ.14. 07 కోట్లతో జిల్లాపరిషత్ బడ్జెట్ ఆమోదం-జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజాపరిషత్ 2026-27 ఆర్ధిక సంవత్సరానికి 14 కోట్ల 7 లక్షల 80 వేల రూపాయలతో రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలను సమావేశం ఆమోదించింది. అదే విధంగా 2025-26 ఆర్ధిక సంవత్సరానికిగాను 12 కోట్ల 23 లక్షల 80 వేల కోట్ల రూపాయలతో సవరించిన బడ్జెట్ ను సమావేశం ఆమోదించింది. సమావేశంలో జిల్లాపరిషత్ ఇంచార్జ్ సీఈఓ భీమేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా రెవిన్యూ అధికారి నారాయణరెడ్డి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జెడ్పిటిసి లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాలకృష్ణపై దాడి కేసు ఛేదన కీలక అరెస్టులు

**- అల్లరి ముకలు,రౌడీయిజానికినో...పోలీసుల స్ట్రాంగ్ వార్నింగ్**



ప్రజలకు చేరువ
పట్టణంలో సంచలనం రేపిన కిడ్నాప్, హత్యాయత్నం కేసును పోలీసులు వేగంగా ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు ఆదివారం మీడియా సమావేశంలో వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం... మార్చి 21న రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో సీతాలాంబ గుడి సమీపంలో కుమార్, శివల మధ్య ద్విచక్ర వాహనాల విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. వివాదం తీవ్రరూపం దాల్చడంతో ఇరువర్గాలు తమ అనుచరులను పిలిపించుకున్నాయి. ఈ క్రమంలో వి.ఎం.పల్లికి చెందిన పిల్లి మునిజయకృష్ణ ప్రసాద్ అలియాస్ మాస్, షేక్ హిదాయత్ తదితరులు అక్కడికి చేరుకున్నారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న శివను స్టేషన్‌కు తరలించారు. అనంతరం పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మునిజయకృష్ణ ప్రసాద్ తన అనుచరులతో కలిసి కుమార్, పెంచులయ్యపై దాడికి యత్నించగా వారు తప్పించుకున్నారు.తదుపరి కాసారం రమేష్ కార్యాలయం వద్ద బాధితులపై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనను అడ్డుకునేందుకు వచ్చిన మార్కెట్ కమిటీ అటెండర్ తుమ్మ బాలకృష్ణను నిందితులు బెదిరించి బలవంతంగా మోటార్ సైకిల్‌పై ఎక్కించుకుని వి.ఎం.పల్లి వైపు తీసుకెళ్లారు.మార్గమధ్యంలోని భాస్కరపేట జంక్షన్ వద్ద ఒకరి ప్రేరణతో మునిజయకృష్ణ ప్రసాద్ సమీప దుకాణం నుండి గాజు కూల్‌డ్రింక్ బాటిల్ తీసుకుని బాలకృష్ణ తలపై దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వాహనాల రాక గమనించిన నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ, ఆధ్వర్యంలో, డీఎస్పీ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

**అరెస్ట్ చేసిన వారు:**
పిల్లి మునిజయకృష్ణ ప్రసాద్ (22)షేక్ హిదాయత్ (27)

నిందితుల వద్ద నుండి నేరానికి వినియోగించిన మోటార్ సైకిల్, గాజు బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

# రైతు మెడకు ఉరి బిగిస్తున్న కేంద్రం: రైతు సంఘం విమర్శలు

ప్రజలకు చేరువ
వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు రైతులపై భారంగా మారుతున్నాయని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. కార్పొరేట్లకు అనుకూలంగా నల్ల చట్టాలు తీసుకువస్తూ రైతులను నష్టాల్లోకి నెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.పుచ్చలపల్లి సుందరయ్య భవన్ వద్ద ఆదివారం నిర్వహించిన ఏపీ రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ కూడలి నుంచి సుందరయ్య భవనం వరకు శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్న ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘం జెండాను ఆవిష్కరించారు.బహిరంగ సభలో ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి ఏడాది కార్పొరేట్లకు రుణ రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్న కేంద్రం, రైతులకు గిట్టుబాటు ధరలు, రాయితీలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. పెరుగుతున్న పెట్టుబడి వ్యయానికి సరిపడ మద్దతు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో మొక్కజొన్న, పత్తి, మిరప రైతులు నష్టపోతున్నా కేంద్రం స్పందించడం లేదని ఆరోపించారు. సరైన విదేశాంగ విధానం లేకపోవడమే ఇందుకు కారణమని పేర్కొన్నారు.తిరుపతి జిల్లాలో ధాన్యం కొనుగోలు



కేంద్రాలు లేక రైతులు దళారులకు తక్కువ ధరలకు పంటలను అమ్ముకోవాల్సి వస్తోందని వాపోయారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సాగునీటి సదుపాయాల కొరతతో పంటల సాగు కష్టతరమైందని, ఎస్ఎస్ కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచితంగా బోర్లు వేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, ప్రధాన కార్యదర్శి హేమలత, పూర్వ కార్యదర్శి అంగేరి పుల్లయ్య, కోశాధికారి ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "వడ్డే ఓబన్న"విగ్రహావిష్కరణ

**- ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రులు సవితమ్మ, పార్థసారథి.**




ప్రజలకు చేరువ
నూజివీడు పట్టణంలోని ఆర్.ఆర్.పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ కలిసి ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముందుగా నూజివీడు పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద నుండి నిర్వహించిన భారీ మోటార్ సైకిల్ ర్యాలీలో భారీసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ర్యాలీగా విగ్రహం వద్దకు చేరుకున్న అనంతరం మంత్రులు విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు.అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో మంత్రులు మాట్లాడుతూ, వడ్డే ఓబన్న సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం కోసం ఆయన చేసిన కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజా నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# నాయుడుపేటలో బీజేపీ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమం




ప్రజలకు చేరువ
పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్--2026 కార్యక్రమంలో భాగంగా నాయుడుపేట మరియు ఓజిలి మండల స్థాయిలో నిర్వహించిన ప్రశిక్షణ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఆంధ్రప్రదేశ్ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.వి. అమర్ నాథ్ ముఖ్యంగా పాల్గొని, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న నాలుగు ముఖ్య కార్యక్రమాలపై నాయకులకు అవగాహన కల్పించారు. ఆయన ప్రసంగిస్తూ "మన్ కీ బాత్ (మనసులో మాట), మన ఊరు--మన జెండా, చేరువ, జనతా వారధి" వంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా పార్టీ భావజాలం ప్రజలకు మరింత చేరువ అవుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నా రెడ్డి దయాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా. శ్రీహరి రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, నాయుడుపేట మండల అధ్యక్షుడు భాను, ఓజిలి మండల అధ్యక్షుడు పవన్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం కోసం నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి పనులు



ప్రజలకు చేరువ
కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో దెందులూరు నియోజకవర్గంలో తాజాగా దాదాపు రూ. 29 కోట్ల రూపాయల విలువైన సుమారు 100 పైగా అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని, నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోగల పలు గ్రామాల్లో సీసీ రోడ్లు డ్రైనులు నిర్మాణ పనులు, డబ్ల్యూ బి ఏం రోడ్లతో పాటు తారు రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని రాబోయే రోజుల్లో గ్రామాల్లో మరిన్ని అంతర్గత రహదారులు కూడా నిర్మించి గ్రామాలను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్ళేందుకు కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.పెదవేగి మండలం దుగ్గిరాల్లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం పలువురు నియోజకవర్గ కూటమి నాయకులు అధికారులు ప్రజలు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలను పలు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి విచ్చేసిన ప్రజల నుంచి వినతులు స్వీకరించిన దెందులూరు ఎమ్మెల్యే శ్రీ చింతమనేని ప్రభాకర్ గారు వాటిని పరిశీలించిన అనంతరం సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.